క్లుప్తంగా

విజయవంతం చేయండి

డోన్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదీన నీరు– మీరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉన్నతస్థానాలు అధిరోహించాలి

బనగానపల్లె: లక్ష్యంతో ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలు అధిరోహించాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సూచించారు. తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నియోజకవర్గంలో ఆయా మండలాల్లో పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన ఆరుగురు విద్యార్థులకు బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.50 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, కళాశాల ప్రిన్సిపాల్ రాజిక, రిటైర్డ్ హెచ్‌ఎం బీవీ పక్కిరారెడ్డి పాల్గొన్నారు.

సొంత మండలాల్లోనే బదిలీలు చేయాలి

కొలిమిగుండ్ల: సొంత మండలాల్లోనే బదిలీలు చేయాలని సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఎంతోమంది ఉద్యోగులు సొంత మండలాల్లోనే ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఇతర మండలాల్లో పోస్టింగ్ ఇస్తే చాలీచాలని వేతనాలతో ఆర్థిక సమస్యలు ఎదురవుతాయని, ప్రభుత్వం పునరాలోచించి సొంత మండలాల్లోనే బదిలీలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్ టీచర్ల బదిలీ

కొలిమిగుండ్ల: స్థానిక మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పది మంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. చంద్రసేనారెడ్డి, వరలక్ష్మి అనంతపురం జిల్లా పుట్లూరుకు, ప్రసాద్ అవుకు, స్వాతి బనగానపల్లె, చార్లీస్ ఇజ్రాయెల్ ఆస్పరి, నిర్మల ప్రశాంతి, శివలింగారెడ్డి ఆళ్లగడ్డకు, చంద్రకళ గోస్పాడు, స్వప్న గోనెగండ్ల మోడల్ స్కూళ్లకు బదిలీపై వెళ్లారు. ఇక్కడి నుంచి పది మంది బదిలీ కాగా ఇతర పాఠశాలల నుంచి నలుగురు ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారని ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు.

నొస్సం సచివాలయానికి అనుసంధానం

సంజామల: అక్కంపల్లె గ్రామ పంచాయతీ నొస్సం సచివాలయానికి అనుసంధానం చేస్తూ ఎంపీడీఓ సాల్మన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అక్కంపల్లె గ్రామ పంచాయతీ పాలనా వ్యవహారాలు ఆర్.లింగందిన్నె సచివాలయానికి అనుసంధానంగా ఉండేవి. అక్కంపల్లె నుంచి ఆర్.లింగందిన్నె గ్రామానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరం ఉండడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు నొస్సం సచివాలయానికి అనుసంధానం చేశారు. ఇకపై నొస్సం సచివాలయంలో సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాల్మన్ సూచించారు.

ప్రకృతి మాతకు గ్రామోత్సవం



ప్రకృతిమాతకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అవుకు: మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ అనుకున్నంత వర్షాలు కురవకపోవడంతో రైతులు, ప్రజలు ప్రకృతి మాతకు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిలా అలంకరించి ట్రాక్టర్‌పై ఊరేగింపుగా పురవీధుల గుండా తిప్పారు. వర్షాలు పుష్కలంగా కురిసి, పంటల దిగుబడులు మెండుగా రావాలని ప్రకృతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా రైతులను ఆశీర్వదించాలని వేడుకుంటూ భజనలు చేశారు. కార్యక్రమంలో చెన్నకేశవస్వామి ఆలయ భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో ఈనెల 19వ తేదీన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వినయ్ సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ బాలురు, బాలికల జట్లకు క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు.2010 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 31వ తేదీ మధ్య పుట్టిన క్రీడాకారులు అర్హులన్నారు. సీఆర్ఎస్ పూర్తయిన ఆటగాళ్లు తమ సీఆర్ఎస్ ఐడీనెంబరులను చూపించాలన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఫొటోలు సమర్పించాలన్నారు.

మహానందిలో ఆర్అండ్‌బీ సీఈ పూజలు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో బుధవారం ఆర్అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు, ఈఈలు శ్రీధర్ రెడ్డి, కృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలంకార మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.

రైతన్నకు సాయం అందేనా?

ఒకవైపు ఖరీఫ్ ముంచుకొస్తోంది.. మరో వైపు ముందస్తు వర్షాలు మురిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వం నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొందరు అప్పోసప్పో చేసి విత్తనాలు వేస్తున్నారు. అప్పు పుట్టని పేద రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సుఖీభవ పేరుతో ఏటా రూ.20 వేలు ఇస్తామని ఓట్లు దండుకుని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గత ఏడాదిలాగే ఈ సారి కూడా తెప్ప తగలేస్తుందా.. లేక సాయం చేసి అన్నదాతలను ఆదుకుంటుందా వేచి చూడాలి.

- అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతున్నకు పెట్టుబడి సాయం
- అదును సమీపిస్తుండటంతో విత్తనాలు, ఎరువులు అందక ఆందోళనలో అన్నదాతలు



సంజామల: మండలంలో సుమారు 46,500 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. వరి, మిర్చి, మినుము, కంది, పెసర, పొగాకు తదితర పంటలను అధికంగా రైతులు సాగు చేస్తారు. ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఏడాది అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. ఈ ఏడాదైనా ప్రతి రైతుకు రూ.20 వేలు అందించాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు పంట సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రైతు భరోసా పథకాన్ని అమలు చేసేది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాల్లో జమ అయ్యేవి. ఈ మొత్తం రైతుకు మూడు విడతల్లో అందేవి. చెప్పిన ప్రకారం జగన్ ప్రభుత్వం రైతులకు అందజేసింది. అంతేకాకుండా అర్హులైన ప్రతి కౌలు రైతుకు ఏడాదికి రూ.13,500 చొప్పున జమ చేసింది.

రైతులకు తప్పని ఎదురుచూపులు

ప్రస్తుతం పంటలు సాగు చేయడానికి పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. మరికొందరు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో పెట్టుబడి సాయం అవసరం. అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామని కూటమి నాయకులు మేనిఫెస్టోలో ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని విస్మరించారు. ఈసారైనా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ చేయకపోతారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

అర్హులందరికీ పథకం అందుతుంది



నిబంధన మేరకు రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుంది. మండలంలో 7,698 మంది రైతులకు ఈ పథకం వర్తింపజేస్తుంది. ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలి. కొందరు రైతులకు నోడేటా అని వస్తుంది. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తాం. – భూమా జ్యోతి, మండల వ్యవసాయ అధికారి, సంజామల

హామీని నిలబెట్టుకోవాలి



అధికారంలోకి వస్తే పంట సాగుకు రూ.20వేలు ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. అయినా గత ఏడాది హామీని అమలు చేయలేదు. ఈసారి ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికైనా ప్రతి రైతుకు రూ.20వేల చొప్పున ఖాతాల్లో జమ చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. లేకపోతే చంద్రబాబు నాయుడును ఎప్పటికీ నమ్మం.

– ధర్మారెడ్డి, మిర్చి రైతు, ఆకుమల్ల గ్రామం

ఆర్థిక సాయం అందించాలి



వ్యవసాయ పనులు మొదలయ్యాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనే సమయం. ఇప్పుడే ఆర్థిక సాయం చేసి ప్రభుత్వం మాలాంటి రైతులకు అండగా నిలవాలి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేసుకున్నాం.

– కొటిక శేఖరప్ప, రైతు, ఆకుమల్ల గ్రామం

జూమ్ మీటింగ్‌లతో ప్రజల ఇక్కట్లు



తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

డోన్ టౌన్: ఉన్నతాధికారులు నిర్వహించే జూమ్ మీటింగ్‌లపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు ప్రజలు వస్తుంటే మండల స్థాయి అధికారులు జూమ్ మీటింగ్‌లో పాల్గొని ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని దీంతో గంటల తరబడి తాము కార్యాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి ప్రజలు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అయితే తహసీల్దార్ జూమ్ మీటింగ్‌లో ఉన్నారని సిబ్బంది తెలియజేయడంతో ఆయన రాకకోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అక్కడ కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో నేలమీద కూర్చోవాల్సి రావడంతో వృద్ధులు,మహిళలు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయ పనివేళల్లో కాకుండా మిగిలిన సమయంలో జూమ్ మీటింగ్‌లు నిర్వహించుకోవాలని, తమను ఇబ్బందులు పెట్టవద్దని వారు కోరారు.

కుల అహంకారాన్ని చూపుతున్న కూటమి నాయకులు



మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్ టౌన్: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఏమి సాధించిందో తెలియదు కానీ.. ఈ సమయంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మాత్రం కుల అహంకారాన్ని చూపుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోని మండలం ధనాపురంలో దళిత సర్పంచ్‌ను అవమానించిన ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న ధనాపురంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనకు సంబంధించి సంబరాల్లో భాగంగా గ్రామంలోని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అయితే సభ ప్రారంభించిన కొంత సమయానికి సర్పంచ్‌ను స్టేజీ పైకి పిలవడం అవమానించడమేనన్నారు. అంతే కాకుండా.. గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ.. సర్పంచ్ చంద్రశేఖర్ ఎస్సీ కాబట్టి వేదికపైకి రాడు అని చెప్పడం దుర్మార్గమన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మిన్నకుండటం కుల వివక్షను ప్రోత్సహించడమేనన్నారు. చివరకు సర్పంచ్ వేదిక వద్దకు వచ్చినా పైకి పిలువకుండా కిందే నిలబెట్టి మాట్లాడటం అంటరానితనాన్ని ప్రోత్సహించడమేన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య,రాధకృష్ణ ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ

- ట్రాక్టర్ డ్రైవర్ మృతి. • ఇద్దరికి గాయాలు

ప్యాపిలి: మండలంలోని గోపాలనగరం మిట్ట వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ బలరాముడు (30) మృతి చెందాడు. ఊటకొండ గ్రామానికి చెందిన బలరాముడు ట్రాక్టర్ నడుపుకుంటూ స్వగ్రామానికి వస్తుండగా గోపాలనగరం వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ ఒక్కసారిగా పల్టీలు కొట్టడంతో బలరాముడుకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న బెస్త రామారావు, ఆదిలక్ష్మి దంపతులకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా బలరాముడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామారావు, ఆదిలక్ష్మి దంపతులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరు విచారించారు.

వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బనగానపల్లె: పెండేకంటి వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివని అతిథి జాగర్లపూడి శ్యామ సుందర శాస్త్రి అన్నారు. వెంకటసుబ్బయ్య జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై పాణ్యం వసుందరదేవి రచించిన పుస్తకాన్ని బుధవారం ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని పెండేకంటి పబ్లిక్ స్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామసుందర శాస్త్రి మాట్లాడుతూ పెండేకంటి వెంకటసుబ్బయ్య సర్పంచ్ స్థాయి నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, బిహార్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్లుగా సేవలందించారన్నారు. ఆయన కుమారుడు పెండేకంటి బాలాజీ వారసులుగా ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమన్నారు. పెండేకంటి బాలాజీ మాట్లాడుతూ తన తండ్రి వెంకటసుబ్బయ్య విద్యా, వ్యవసాయాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. బనగానపల్లె ప్రాంతంలో పెండేకంటి పబ్లిక్ స్కూల్, పాలిటెక్నికల్ కళాశాల, ఐటీఐ విద్యాసంస్థలతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి యాగంటిపల్లెలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, ఏఓ సురేష్, ప్రిన్సిపాల్ సుందర్‌రాజన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గులాం అలియాబాద్ తండాలో మాట్లాడుతున్న ఐటీడీఏ అధికారులు

బనగానపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆబ జన్‌భగిదరి అభియాన్ పథకాన్ని గిరిజన తండా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీడీ జి నాయక్, ఏపీఓ సురేష్‌కుమార్ సూచించారు. జన్ జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలోని గులాంఅలియాబాద్ తండా, రాళ్లకొత్తూరు తండాల్లో పర్యటించి, ప్రజలకు ధర్తి ఆబ జన్‌భగిదరి అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి రేషన్, ఆధార్, జాబ్ కార్డులులతో పాటు జల్‌జీవన్ పథకం కింద ఇంటింటికి తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పశువైద్యులు రామ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హమీద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

బేతంచెర్ల: బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరం అని, వాటిని ప్రోత్సాహించిన వారు శిక్షార్హులని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు జరగకుండా మహిళా పోలీసులు, మెప్మా, ఆర్పీలు, వీఆర్వో, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఐసీడీఎస్ సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

డోన్ టౌన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పాత బస్టాండ్‌లోని సమైఖ్యాంధ్ర కట్ట వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఎరోబిక్ పద్ధతిలో యోగాసనాల ద్వారా కలిగే లాభాలను వివరించారు. యోగా ద్వార ఆరోగ్యం సిద్ధిస్తుందని నిత్యం సాధన ఎంతో ఉపయోగకరమని చెప్పారు.

దొరపల్లె ఎంపీటీసీ రాజీనామా

డోన్ టౌన్: మండలంలోని దొరపల్లె గ్రామనికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు డి.సుభద్ర వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది. జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డికి తన రాజీనామా పత్రాన్ని బుధవారం అందజేసినట్లు సమాచారం. డోన్ ఎంపీడీఓ వెంకటేశ్వరెడ్డిని కలిసి రాజీనామా పత్రాన్ని సీఈఓకు అందించారు.

రేపు రక్తదాన శిబిరం

డోన్ టౌన్: స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా 70వ వసంతాల సందర్భంగా ఈ నెల 20వ తేదీన స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని క్లబ్ హౌస్‌లో మెగా రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ హరికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా స్టేట్ బ్యాంక్ వారు 70వేల రక్తం యూనిట్లను సేకరించాలనే సంకల్పంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తరలివచ్చి రక్త దానం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక మహిళ మృతి

బేతంచెర్ల: ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.వివరాలు..పట్టణంలోని అల్లా బకాష్ దర్గా కాలనీకి చెందిన షేక్ మైమూన్ (47) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. పలుచోట్ల వైద్యం చేయించినా నయం కాక పోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పురుగు మందు సేవించి ఆత్మ హత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి బుధవారం తెలిపారు.

నిజాయితీ సేవలకే గుర్తింపు



ఎస్‌టీఓ రఘునందన్‌తో పాటు ఇతర అధికారులను సత్కరిస్తున్న పెన్షన్‌దారులు



పశుసంవర్ధక శాఖ అధికారులను సత్కరిస్తున్న సిబ్బంది

డోన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తే మంచి గుర్తింపు పొందవచ్చునని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఎమ్మిగనూరుకు బదిలీపై వెళ్తున్న సబ్‌ట్రెజరీ అధికారి రఘునందన్, సీనియర అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్‌కు పెన్షన్‌దారులను బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన ఎస్‌టీఓ సునిల్‌కుమార్‌తో పాటు బదిలీపై వెళ్తున్న వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో శతావధాని, కళారత్న గండ్లూరి దత్తాత్రేయ శర్మ, సంఘం కార్యదర్శి గాలయ్య, అధ్యక్షుడు సుబ్బరాయుడు, సభ్యులు గోపాల్, నరసింహులు, రామకృష్ణారెడ్డి, రాందాస్‌రెడ్డి, హుసేన్ సాహెబ్, మౌలాలి పాల్గొన్నారు. అలాగే.. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో బదిలీపై వెళ్తున్న డాక్టర్ హరీష్, షేక్షావలి, డాక్టర్ పద్మావతి దేవి, గౌసియాబేగంను పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో సన్మానించి వీడ్కోలు పలికారు. అధికారులు మహమ్మద్ రఫి, నాగలక్ష్మిదేవి, ఈశ్వర్‌నాయక్, రామాంజనేయులు, నవ్య, లక్ష్మి, నాగార్జున పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ జనార్దన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అమ్ముతూ ఆర్థిక దోపిడీకి పాల్పడే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విక్రయాలు సాగిస్తున్న పట్టణంలోని శ్రీవాణి విద్యా సంస్థ గుర్తింపు రద్దు చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని నంద్యాలలో డీఈఓ జనార్దన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా నాయకులు శిధర్ రెడ్డి, చందు, ధనుష్, అస్లాం పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫాం విక్రయించరాదు..

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయాలు చేపట్టరాదని ఎంఈఓ సోమశేఖర్ బుధవారం తెలిపారు. శ్రీవాణి స్కూల్‌తో పాటు పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీవాణి స్కూల్‌కు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ భవనంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. నిచ్చెనమెట్ల గ్రామంలో విద్యుత్, తాగునీటి సమస్యలు ఉన్నాయని అన్నవరం ఎంపీటీసీ సభ్యుడు గోపవరం గోపాల్ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండల మీట్‌కు కొందరు అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గైర్హాజరు కావడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, డాక్టర్ అభినయ్, పశువైద్యురాలు భారతీదేవి, వైస్ ఎంపీపీ రామప్ప తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో నిరుపయోగంగా రైతు బాజారు



కలెక్షన్ సెంటర్ గోడౌన్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిన దృశ్యం

వినియోగించుకోరా?

- నిరుపయోగంగా రైతుబజార్
- ప్రారంభించి 15 నెలలవుతున్నా పట్టించుకోని యంత్రాంగం
- ప్రారంభానికి నోచుకోని కలెక్షన్ సెంటర్ గోడౌన్
- 17 నెలల క్రితం నిర్మాణం పూర్తి

బేతంచెర్ల: ఆయా గ్రామాల రైతులు తాము పండించిన కూరగాయలను పట్టణంలో విక్రయించుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రైతు బజార్‌ను రూ.27 లక్షలతో నిర్మించారు. నిర్మాణం పూర్తవడంతో గతేడాది మార్చి 14న ప్రారంభించారు. రైతు బజారు ప్రారంభించి 15 నెలలు అవుతున్నా వినియోగంలోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. దీంతో రైతులు కూరగాయలను విక్రయించుకోలేకపోతున్నారు. వినియోగానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకరావాలని పట్టణ ప్రజలు, రైతులు కోరుతున్నారు. రైతు బజారు వినియోగంలోకి వస్తే అటు రైతులతోపాటు ఇటు పట్టణ ప్రజలకు తక్కువ ధరకు కూరగాయలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రారంభానికి నోచుకొని కూరగాయల, పూల కలెక్షన్ సెంటర్..

మండలంలోని గోరుమానుకొండ మెట్ట వద్ద కర్నూలు రహదారిలో గోరుమానుకొండ, సీతారామాపురం, యంబాయి, శంకరాపురం, ఎం.పెండేకల్లు, కొలుముల పల్లె గ్రామాల రైతులు పండించిన కూరగాయలు, పూలు విక్రయించుకునేందుకు సుమారు 17 నెలల క్రితం ఉద్యాన శాఖ, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో కలెక్షన్ సెంటర్ కోసం గోడౌన్ నిర్మించారు. నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో గోడౌన్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. ఉద్యాన శాఖ, వెలుగు అధికారులు కలెక్షన్ సెంటర్ గోడౌన్ ప్రారంభించాలని కోరుతున్నారు.